క్లుప్తంగా

రామిరెడ్డికి బూచేపల్లి నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

ముండ్లమూరు (దర్శి): మండలంలోని జమ్మల మడుగు గ్రామానికి చెందిన సుంకర రామిరెడ్డి (45) మృతదేహానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

6న వినతుల స్వీకరణ

తాళ్లూరు: ఎస్సీల ఉప వర్గీకరణకు సంబంధించిన ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ ఈ నెల 6వ తేదీన ఒంగోలులోని కలెక్టరేట్‌లో ఇరువర్గాల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ కె.సుందరరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ చైర్మన్‌గా నియమించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారన్నారు.

కిశోర వికాసం, బంగారు బాల్యంపై సమీక్ష


కిశోర వికాసం, బంగారు బాల్యంపై వివరిస్తున్న గ్రామస్థాయి కమిటీ సభ్యులు

సంతనూతలపాడు: సంతనూతలపాడు హైస్కూల్లో శుక్రవారం కిశోర వికాసం, బంగారు బాల్యం పై గ్రామస్థాయి కమిటీ సమావేశంలో సమీక్ష నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలికల లైంగిక వేధింపులు, ప్రేమ పేరుతో మోసాలు తదితర వాటిపై చర్యలు, తగు జాగ్రత్తల పై సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్చార్జి హెచ్‌ఎం. ఎస్.ఉమామహేశ్వరి, వీఆర్వో దాసరి శ్రీనివాసులు, అంగన్‌వాడీ టీచర్లు సీహెచ్ మరియమ్మ, ఎం నాగేంద్రం, అరుణ, అంజమ్మ, లక్ష్మి, మాధవీ లత తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ లారీల పట్టివేత


పట్టుబడిన లారీలు

చీమకుర్తి రూరల్: మైనింగ్ బిల్లులు లేకుండా అక్రమంగా గ్రానైట్ ముడిరాళ్ల రవాణా చేస్తున్న లారీలు, గ్రానైట్ కంటైనర్ లను గనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. రామతీర్థం ప్రాంతంలో మైనింగ్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు చేయగా 2 గ్రానైట్ ముడిరాళ్ల లారీలు, 3 కటింగ్ పీసుల లారీలను మైనింగ్ అధికారులు ఏపీఎండీసీ ప్రాంగణంలోకి తరలించారు.

పెరుగుతున్న చలి తీవ్రత

- ప్రజలు హిస్నోఫీలియా, న్యూమోనియా బారిన పడే ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న ప్రభుత్వ వైద్యాధికారులు


చలి తీవ్రతకు ప్రజలు ఇలా..

పెద్దదోర్నాల: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పొగమంచు, చలి తీవ్రత రోజు రోజుకూ పెరుగుతోంది. చిన్నారులు, వయసు మళ్లిన వారు జలుబు, జ్వరంతో పాటు శ్వాస కోశ సంబంధిత వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మండల కేంద్రంలోని ప్రైవేటు, ప్రభుత్వ వైద్యశాలల్లో జలుబు, జ్వరాల బారిన పడిన వారితో నిండిపోతున్నాయి. మండల పరిధిలోని దట్టమైన నల్లమల అభయారణ్య ప్రాంతంతో పాటు అటవీ పరిసర ప్రాంతాల్లో పొగమంచు విపరీతంగా కురుస్తోంది. చలి తీవ్రత రోజు రోజుకు విపరీతంగా పెరుగుతుండటంతో పలువురు ఇస్నోఫీలియా, న్యూమోనియా వ్యాధుల బారిన పడుతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రస్తుత తరుణంలో చిన్న పిల్లలు, వృద్ధుల పట్ల అప్రమత్తంగా ఉండి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి లావణ్య సూచిస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో సంచరించే చెంచు గిరిజనులతో పాటు అటవీ ప్రాంత పరిధిలోని గ్రామాల్లో నివసించే ప్రజలు పొగమంచులో సంచరించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచిస్తున్నారు. పొగమంచు, చలిలో సంచరిస్తే జలుబు, జ్వరాలతో పాటు న్యూమోనియా వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని, వీటితో పాటు ఊపిరితిత్తులు, కాలేయ సంబంధిత వ్యాధులు, చర్మ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరిస్తున్నారు. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుందని, 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైన సందర్భాల్లో ఆయా వ్యాధుల బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉందని, దీంతో చిన్నారులు, వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తి ఆరోగ్యాలు క్షీణించటంతో మరణాలు సైతం సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. శీతాకాలంలో బయట తిరిగే వ్యక్తులు తలకు, శరీరానికి చలిని నివారించే ఉన్ని దుస్తులు ధరించాలని, చిన్నారులను బయట తిప్పడం మానుకోవాలని, ప్రయాణించే సమయాల్లో చలి తీవ్రత నుంచి చిన్నారులను రక్షణ కలిగించే దుస్తులను వాడుకోవాలని, చిన్నారులను బహిరంగ ప్రదేశాల్లో స్నానాన్ని చేయించటం వంటి వాటిని మానుకోవాలని ఆయన సూచిస్తున్నారు.

> **ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి**
> పొగమంచు, చలి తీవ్రత ఉన్న సమయాల్లో పిల్లలు, వృద్ధుల ఆరోగ్య సమస్యలపై శ్రద్ధ వహించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా జలుబు, జ్వరాలు ఉన్న సమయాల్లోనే సమీప వైద్యులను సంప్రదించి సలహాలు, సూచనలు పాటించాలి. ఇంట్లో వెచ్చదనం ఉండేలా చర్యలు తీసుకోవాలి.
> – డాక్టర్ లావణ్య, వైద్యాధికారి, సామాజిక ఆరోగ్య కేంద్రం

సావిత్రిబా పూలే సేవలు ఆదర్శనీయం


యర్రగొండపాలెం: సన్మాన గ్రహీతలతో ఎంఈవోలు, ఉపాధ్యాయులు


దర్శి: సావిత్రిబా పూలే జయంతి చేస్తున్న ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: ఆధునిక విద్య ద్వారా స్త్రీ అభ్యున్నతి సాధించవచ్చని నమ్మి ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దిన సావిత్రిబా పూలే ఆదర్శవంతురాలని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లా నాయక్ అన్నారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబా పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. కులమతాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ఆమె అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు. తక్కువ సెలవులు వాడుకొని పాఠశాలల్లో ఎక్కువగా పనిచేసిన ఉపాధ్యాయినులు పద్మావతి, సీహెచ్ రాధ, మల్లేశ్వరి, అనిత, జ్యోతి, విజయబాయిలను వారు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

దర్శి: మండలంలోని పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సావిత్రిబా పూలే జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సావిత్రిబా పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి బంగారు బాల్యం గురించి విద్యార్థులకు వివరించారు. పిల్లలకు స్వీట్లు, పెన్నులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ గోపిశెట్టి ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మాధవి, కాశీం పాల్గొన్నారు.

దళిత బహుజన రిసోర్స్ సెంటర్‌లో..

దళిత బహుజన రిసోర్స్ సెంటర్, రాష్ట్ర దళిత సేన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాయినగర్ ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత అధ్యక్షతన సావిత్రిబా పూలే 194వ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర దళితసేన నియోజకవర్గ అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంథం ఇర్మియా, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కావూరి నాగమణి, కళాంజలి ఈవెంట్ అధినేత దిడ్ల రమేష్, ఉపాధ్యాయులు సరళ, సుజాత, సుభాషిణి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబా పూలే జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ, డాక్టర్ కె.ప్రభుదాస్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి.వేణు, తెలుగు లెక్చరర్ బి.శౌరేలమ్మ, కామర్స్ లెక్చరర్ బీవీ రమణారావు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

తూర్పువీరాయపాలెంలో..

మండలంలోని తూర్పువీరాయపాలెం ప్రీ హైస్కూల్లో అట్లూరి రామారావు అధ్యక్షతన సావిత్రిబా పూలే జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఉపాధ్యాయినులకు సన్మానం చేశారు. ఎం.అశ్వని, ఎస్‌కే మస్తాన్‌బీ, ఐ.వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, నాగార్జున, విక్రం పాల్గొన్నారు.


దర్శి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్‌లో..


తూర్పువీరాయపాలెంలో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

డ్రగ్స్ ఫ్రీపై అవగాహన


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్‌వీ రమణ

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్ ఫ్రీ, డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం క్రింద డ్రగ్స్ నిర్మూలనపై ఎక్సైజ్ శాఖ సహకారంతో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన, యువత ఆరోగ్యాన్ని కాపాడుకోవడం దేశాభివృద్ధికి అవసరమన్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు విద్యార్థులు జీవితంలో డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా సూచనలు అందించి డ్రగ్స్ వద్దు అనే సందేశాన్ని సొసైటీలోని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని విద్యార్థులను కోరారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎక్సైజ్ శాఖ అధికారులు డ్రగ్స్‌లోని హానికర స్వభావం గురించి చిత్రాన్ని ప్రదర్శించారు. డాక్టర్ కె.ప్రభుదాస్, డాక్టర్ ఏ.నగేష్, డాక్టర్ జి.వేణు, డాక్టర్ కె.నరేష్‌కుమార్‌లు డ్రగ్స్‌తో కలిగే హానికర ప్రభావాల గురించి వివరించారు. బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లింగ హింస నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు లింగ హింస నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ లింగ సమానత్వం, మహిళా సాధికారత గురించి వివరించారు. మహిళల రక్షణకు సంబంధించిన వివిధ చట్టాల గురించి మాట్లాడారు. మహిళలు, పురుష విద్యార్థులు లింగ హింసను నివారించడం గురించి ప్రతిజ్ఞ చేశారు. మహిళా లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

హైందవ శంఖారావం సభను జయప్రదం చేయండి


విశ్వహిందూ పరిషత్ సభ్యులు

దొనకొండ: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన విజయవాడలో జరిగే హైందవ శంఖారావం సభకు ప్రతి గ్రామం నుంచి ప్రతి ఇంటికి ఒకరుగా తరలి వచ్చి జయప్రదం చేయాలని భైరవానంద స్వామి కోరారు. సభకు వచ్చే వారి కోసం ఆ రోజు ఉదయం 5 గంటలకు ఆనంద ఆశ్రమం నుంచి బస్సు బయల్దేరుతుందన్నారు. వచ్చే వారు సమయ పాలన పాటించి ఆశ్రమానికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్


ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న కమాండర్

దొనకొండ: స్థానిక విశ్వభారతి విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు 34 ఆంధ్రా బెటాలియన్ ఒంగోలు పీఐ స్టాఫ్ సంతోష్‌కర్ సింగ్, ఎంవీ నారాయణ శుక్రవారం ఫిజికల్ టెస్ట్, రిటర్న్ టెస్ట్ నిర్వహించారు. జరగబోయే ఫైనల్ ఏ సర్టిఫికెట్ ఎగ్జామ్స్‌లో మంచి రిజల్ట్ వస్తుందని విశ్వభారతి విద్యాలయం వ్యాయామ ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ కేర్ టేకర్ షేక్ జిలానీ తెలిపారు. ఆంధ్రా బెటాలియన్ స్టాఫ్‌కు, కమాండర్ ఆఫీసర్ మోహన్‌రావుకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

రెవెన్యూ సదస్సులో అర్జీల స్వీకరణ



పెద్దారవీడు: రైతు నుంచి అర్జీ స్వీకరిస్తున్న డీటీ ఇబ్రహీం ఖలీల్


దొనకొండ: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువులో రెవెన్యూ అధికారులు శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి 9 అర్జీలను తహసీల్దార్ బి.రమాదేవి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. భూ సమస్యలను రెవెన్యూ సిబ్బందితో పరిష్కరించి అర్హులైన వారికి ఆన్‌లైన్, ఈ–పాస్ పుస్తకాలు మంజూరు చేస్తామని చెప్పారు. రీ సర్వే డీటీ కేవీ నాగార్జునరెడ్డి, ఆర్ఐ రామారావు, లైసెన్స్ సర్వేయర్ సీహెచ్ వెంకట్రావు, వీఆర్‌ఓ యేసయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారవీడు: గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఇబ్రహీం ఖలీల్ అన్నారు. మండల పరిధి దేవరాజుగట్టు సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూమికి సంబంధించిన ఏదైనా సమస్యలు ఉంటే అర్జీ రూపంలో విన్నవించుకుంటే రెవెనూ సిబ్బంది ద్వారా పరిష్కరిస్తామని చెప్పారు. రైతుల నుంచి వివిధ భూ సమస్యలపై అర్జీలు స్వీకరించి రశీదులు అందజేశామని తెలిపారు. ఆర్ఐ గోపి, మండల సర్వేయర్ రామగోపాలరెడ్డి, వీఆర్వో విజయభాస్కరరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

దర్శి: కాలం చెల్లిన బస్సులు, వృద్ధ డ్రైవర్లతో బస్సులు తిప్పుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నెబోయిన రామాంజనేయులు ధ్వజమెత్తారు. పట్టణంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ మూడు నెలల్లో మూడు సార్లు పిల్లలతో ప్రయాణిస్తున్న స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురయ్యాయన్నారు. అదృష్టవశాత్తు అందులో ఉన్న పిల్లలకు ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. ప్రభుత్వం నియమ నిబంధనల ప్రకారం బస్సులు నడపాలని, ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి జి.స్టాలిన్, పొదిలి మండల నాయకులు బెంజిమెన్, సురేంద్ర, కిరణ్, ప్రజ్వల్, అరవింద్ పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పుల్లలచెరువు: మండలంలోని నరజాముల తండా ఆటవీ ప్రాంతం పరిధిలో స్థానిక ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. జిల్లా అధికారుల ఆదేశాలపై స్క్వాడ్ అధికారులతో కలిసి దాడులు చేసి నాటుసారా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం నేరమని, అలా ఎవరైనా చేస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వివరాలు అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.